విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి కృషి చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్, బిల్డింగ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం నగరపాలక సంస్థకు కమీషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజుకు ఆయన చాంబర్లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది సోడిశెట్టి బాలాజీరావు మాట్లాడుతూ పట్టాభి స్మారక భవన నిర్మాణానికి జరుగుతున్న అన్యాయాన్ని నూతన కమిషనర్‌కు వివరించారని, కమిషనర్ సహకరించాలని కోరామని అన్నారు. ఎంపీ బాలసౌరి సీఎం జగన్మోహన్‌రెడ్డికి లెటర్ రాసి కోరగా ప్రభుత్వం కలెక్టర్ ద్వారా పట్టాభి స్మారక భవన నిర్మాణానికి జిల్లా కోర్టు సెంటర్ రెవెన్యూ కల్యాణ మండపం ప్రక్కన రెండు ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించినప్పటికీ, ప్రజలకు ఉపయోగపడే పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి మచిలీపట్నం నగరపాలక సంస్థ అనుమతులు ఇవ్వకపోవడం చాలా దారుణమని ఆయన వెల్లడించారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను అమలు చేయకుండా, మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు కాలయాపన ఎందుకు చేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా పట్టాభి స్మారక భవనానికి అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, కమిటీ ఉపాధ్యక్షుడు, ఏ ఆర్ కే మూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్, కమిటీ జాయింట్ సెక్రెటరీ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, కమిటీ సభ్యుడు, వేమూరి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16వ తేదీ జరప తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. మంగళవారం జ్యోతి బా పూలే విజ్ఞాన కేంద్రం నందు సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నదని దీనికి వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీ జరుగు గ్రామీణ బంద్ ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కృష్ణాజిల్లా సంయుక్త కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులను నష్టపరుస్తుందని, రైతాంగానికి నష్టదాయకమైన నల్ల చట్టాలను రద్దు చేయాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానానికి నిరసనగా మన జిల్లాలో కూడా గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చే 6000 కూడా అందించడం లేదని, రైతాంగాన్ని మోసం చేస్తున్న వైఎస్ఆర్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్టియు న్యూ జిల్లా నాయకులు బి వెంకట రామయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి జ్యోతి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏ. ఏడుకొండలు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కే శర్మ, సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్. జయ రావు, ఏఐటియుసి పట్టణ నాయకులు ఓ.ఎల్.రావు, రైతు సంఘం నాయకులు ఈడే రామారావు, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఎండి యూనస్, తదితరులు పాల్గొన్నారు.

వక్కలగడ్డకు పూర్వ వైభవం

విశాలాంధ్ర-చల్లపల్లి : వక్కలగడ్డకు పూర్వ వైభవం సంతరించుకుందని ప్రజా నాట్య మండలి హైదరాబాద్ నాయకులు హనుమానుల జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. ప్రజా నాట్య మండలి కళాకారులు, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ రావి బాబు రావు, అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు లతో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రజా నాట్యం మండలి కళాకారుల సంస్మరణ సభ మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ప్రగతి నగర్ కు చెందిన హనుమానుల జగన్ మోహనరావు సారధ్యంలో లిలిరైతే రాజులిలి అనే నాటికను ప్రదర్శించారు. నాటకాన్ని తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దాసరి గోవిందరావు ఏకపాత్రాభినయంతో నటించిన అల్లూరి సీతారామరాజు పాత్ర ఆహుతులను ఆకట్టుకుంది, ప్రముఖ రంగస్థల నటుడు, ఆర్టీసీ ఉద్యోగి బోలెం రామారావు కమ్యూనిస్టు పార్టీపాటలపై చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా హనుమనుల జగన్మోహన్ రావు మాట్లాడుతూ నాటక రంగం అంతరించిపోతున్న నేటి తరుణంలో వక్కలగడ్డలో లిలిరైతే రాజులిలి నాటక ప్రదర్శనతో వక్కలగడ్డ గ్రామానికి పూర్వ వైభవం సంతరించుకుందని పేర్కొన్నారు. గతంలో ఈ గ్రామంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించే వారిని గుర్తు చేశారు. కామ్రేడ్ అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు, రావి బాబురావులు పలు నాటకాలను ప్రదర్శించి ఎన్నో బహుమతులను అందుకున్నారని పేర్కొన్నారు. చాలా సంవత్సరాల తర్వాత ఈ గ్రామంలో కళారంగానికి జీవం పోసే విధంగా నాటక ప్రదర్శన కొనసాగినట్లు తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారుల సమస్మరణార్థం అంతరించిపోతున్న నాటకాన్ని ప్రదర్శించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆనాడు కామ్రేడ్ అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు, రావి బాబురావులు ఆశించిన విధంగా వక్కలగడ్డ గ్రామం నుండి అనేకమంది కళాకారులు తయారై సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ పై కేసు కొట్టివేత

విశాలాంధ్ర-మచిలీపట్నం : కులం పేరుతో దూషించారని, వేధించారని ఆర్టీసీ డిపో మేనేజర్ పై మహిళా కండక్టర్ పెట్టిన కేసును విచారణ అనంతరం కొట్టివేస్తూ కృష్ణా జిల్లా 10వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వి.నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. గతంలో గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ గా పనిచేసి ప్రస్తుతం అనంతపురం జిల్లా ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న చుండి బాలాజీ దయాల్ (55)పై గుడివాడ ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌గా పని చేస్తున్న బట్టు స్వాతి(30) ఇతర మహిళ కండక్టర్లతో కలిసి 2020 ఫిబ్రవరి నెలలో ఎస్సీ ఎస్టీ చట్టప్రకారం ఫిర్యాదు చేయగా ఆ కేసును అప్పటి మచిలీపట్నం డీఎస్పీ, ఎండి. మహబూబ్ బాషా దర్యాప్ చేశారు. 18 మంది సాక్షులతో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున విచారించిన సాక్షులు చెప్పిన సాక్ష్యం ప్రకారం నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుడు తరపున న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, కమ్మిలి విజయ్ కుమార్, మద్దాల సువర్ణ రాజు కేసు వాదించారు.

కూచిపూడి ఎస్సై సందీప్ బదిలీ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి ఎస్సై డి సందీప్ బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీలలో భాగంగా కంకిపాడుకి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారంఉత్తర్వులు జారీ చేశారు. కాగా కూచిపూడి ఎస్సైగా మచిలీపట్నం వి ఆర్ నుంచి టీ శ్రీనివాస్ ను కేటాయించినట్టు తెలుస్తోంది.

యువకుల మృతికి ఎమ్మెల్యే కొడాలి నాని సంతాపం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ బస్టాండ్ సెంటర్లో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎమ్మెల్యే కొడాలి నాని పరామర్శించి, ఒక్కో కుటుంబానికి 50 వేల చొప్పున, లక్షన్నర రూపాయలను తక్షణ సహాయంగా అందజేశారు. సియంఓ అధికారులతో ఫోన్లో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నందివాడ ఎంపిపి పేయ్యల ఆదాం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వెంటనే ప్రకటించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్సీ ప్రకటించాలని డిఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో అవనిగడ్డలో డిఎస్సీ అభ్యర్థులు నిరసన దీక్ష చేపట్టారు. నిరసన దీక్షా శిబిరాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించగా,టిడిపి జనసేన నాయకులు వీరికి మద్దతు పలికి వైసిపి ప్రభుత్వం డిఎస్సీ అభ్యర్థులను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఇస్తామని జగన్ మోసం చేశాడని, జగన్ మాటలను నమ్మి ఆయనను గెలిపించి 5 ఏళ్ళగా ఎదురు చూస్తున్నా మెగా డిఎస్సీ రాలేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెగా డిఎస్సీ ప్రకటించాలన్నారు. మంగళవారం డిఎస్సీ అభ్యర్థులు గాంధీక్షేత్రంలో ఒక రోజు నిరసన చేపట్టగా మండలి ప్రారంభించి మాట్లాడారు. కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. డిఎస్సీ అభ్యర్థులు తమ ఆవేదనను తెలుగుదేశం, జనసేన నేతలకు తెలియచేశారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల సంఖ్యలో నిరుద్యోగులు డిఎస్సీ నోటిఫికేషన్ కోసం 5 ఏళ్ళగా ఎదురుచూపులు చూస్తున్నారని జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో తాను అధికారంలోనికి వస్తే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి పేరుతో డబ్బులు దోచుకుని అభివృద్ధి చేసిన పాఠశాలలను 117 జీవోను తీసుకువచ్చి మూయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. మెగా డిఎస్సీ అంటే ఏంటో తెలియని వారు మంత్రులుగా, ప్రభుత్వ సలహాదారులుగా ఉన్నారని మండలి విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అవనిగడ్డకు వస్తే ఉద్యోగం వస్తుందని నమ్మిన వేలాదిమంది డిఎస్సీ అభ్యర్థులు వేల సంఖ్యలో అవనిగడ్డకు వస్తారని, అవనిగడ్డలో ఉంటూ ఒక పూట తిని తినకుండా పస్తులు ఉంటూ ఇళ్ళకు కూడా వెళ్ళలేక ఇబ్బందులు పడుతూ కూలీ పనులు చేసుకుంటున్నారని వారిని చూస్తుంటే ఎందో బాధగా ఉందన్నారు. 5 సంవత్సరాలుగా ఎదురు చూసిన అభ్యర్థులకు కేవలం 6100 పోస్టులతో మిని డిఎస్సీని ప్రకటించారన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో డిఎస్సీ అభ్యర్థులు సున్నా పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని, రానున్న తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అని ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌లు డిఎస్సీ గురించి ప్రస్తావించారని, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడగానే డిఎస్సీ అభ్యర్థులకు తప్పకుండా న్యాయం చేస్తారని అన్నారు. అలా చేయని పక్షంలో ఇదే గాంధీక్షేత్రంలో డిఎస్సీ అభ్యర్థుల కోసం ప్రభుత్వంపై తాను పోరాటం చేస్తానని అభ్యర్థులకు హామీ ఇచ్చారు.

బుసక తవ్వకాలపై వీడని ప్రతిష్టంభన

విశాలాంధ్ర-చల్లపల్లి : నడకు దురు రేవులో బుసక తవ్వకాల విష యమై చెలరేగిన వివాదం ఇంకా ఓ కొలిక్కిరాలేదు. బుసక తవ్వకాలు జరపటమా, నిలిపివేయటమా అన్న విషయమై ప్రతిష్టంభన నెలకొంది. పాగోలు లే అవుట్ కు మెరక పేరుతో ప్రారంభమైన తవ్వకాలు వక్రబాట పట్టాయనీ, లేఅవుట్ కంటే ఎక్కువగా బయటకు విక్రయిస్తున్నారనే కారణం తో రైతులు తవ్వకాలను అడ్డుకోవటం, పాగోలు లబ్ధిదారులు తవ్వకాలకు మద్దతుగా సోమవారం రేవులోకి వెళ్లటం, ఇరుపక్షాల నడుమా వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తహసీల్దార్ బి.సుమతి కార్యాలయంలో ఇరుపక్షాలతో సమావేశమయ్యారు. రైతుల నుంచీ అభ్యంతరాలను, లేఅవుట్ లబ్ధిదారులు, సర్పంచ్లు, వైసీపీ నేతల విజ్ఞప్తులు వేర్వేరుగా తెలుసుకున్నారు. సీఆర్ జెడ్ పరిధిలో అందులోనూ అనుమతులు లేకుండా ప్రొక్లెయిన్ తో ఇష్టానురీతిన తవ్వకాలు ఎలా చేపడతారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పంటచేలకు దగ్గరగా చేపట్టిన తవ్వకాలతో వ్యవసాయం ఇబ్బందికరంగా మారుతుందనీ, ఉప్పునీటి చొరబాటు అధికమవుతుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మెరక పనులు చేయటం జరిగేపనికాదనీ, లే అవుట్ మెరకకు అవకాశం ఇవ్వాలని మహిళలు కోరారు. కొద్దిసేపటి తర్వాత చల్లపల్లి సీఐ సిహెచ్. నాగప్రసాద్ సైతం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ సుమతితో కలిసి ఇరుపక్షాల పెద్దలతోనూ చర్చించారు. బుసక తవ్వకాల నేపథ్యంలో ఇరుపక్షాలూ శాంతిభద్రతల సమస్య తీసుకురావద్దని కోరారు. మెరక పనులు చేయాల్సిన కాంట్రాక్టర్ తమవల్ల కాదని చేతులెత్తేసినట్లు చెబుతున్నారనీ, పేదల విజ్ఞప్తిని మానవతాదృష్టితో చూడాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు విన్న సీఐ, తహసీల్దార్లు లే అవుట్ మొత్తానికి ఒకే చోట నుంచీ కాకుండా కొంత వరకు నడకుదురు నుంచీ తరలించేందుకు అభ్యంతరం పెట్టవద్దని కోరారు. రైతులతో మాట్లాడి తమ అభిప్రాయం చెబుతామని పెద్దలు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు గొరిపర్తి సురేష్, తోట వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ శీరం నాని, రైతు నేతలు కొర్రపాటి వీరసింహుడు, దేవభక్తుని గోపాలకృష్ణ, వడ్లమూడి గోపీచంద్, కైతేపల్లి శ్రీనివాసరావు, రాజులపాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'వెనిగండ్ల రాము బాబు షూరిటీ'

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ మండలం లింగవరం కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి వెనిగండ్ల రాము లింగవరంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, మాజీ సర్పంచ్ మలిరెడ్డి నర్సారెడ్డి, నాయకులు గంటా బాలాజీ, వసంతవాడ దుర్గారావు, టిడిపి జనసేన పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన అధికారులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతన తహశీల్దార్ గా భాధ్యతలు స్వీకరించిన ఏడిద శ్రీనివాస్ ను స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్ ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి దారపు శ్రీనివాస్ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణాధికారి దిలీప్ కుమార్,మండల విద్యాశాఖాధికారి జగన్మోహనరావు,పంచాయితీ రాజ్ ఎఇ పృథ్వీ రాజ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజయకేతనం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీకు జే.ఎన్.టి.యు.కె. కాకినాడ నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో పలు బహుమతులు సాధించి ట్రోఫీను కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. జనవరి మరియు ఫిబ్రవరి లో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా జె.ఎన్.టి.యు.కే. కాకినాడ నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొని, పురుషుల సాఫ్ట్ బాల్ పోటీలో ద్వితీయ స్థానం, సారధి ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా నిర్వహించిన మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ప్రథమ స్థానం, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తృతీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. విజ్ఞాన్ యూనివర్శిటీ, వడ్లమూడి నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడలలో మహిళల వాలీబాల్ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని ట్రోఫీ మరియు15,000 రూపాయల నగదు బహుమతి ని పొందారని, అథ్లెటిక్స్ పోటీలైన షాట్ పుట్ లో బంగారు పతకం, 800 మీటర్లు, మరియు 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలను సాధించి విద్యార్థులు కళాశాల ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను మరియు ఫీజికల్ డైరెక్టర్స్ ఎం.శివ శంకర్, జి. వెంకటేష్, డి. పూజిత లను యాజమాన్య సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండ రామారావు, ఎం.ఆర్.సి. హెచ్. శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, తదితరులు ప్రశంసించారు.

అభివృద్ధిని నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం : వేదవ్యాస్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఎవరైన చేసిన అభివృద్ధిని ఇంకా ముందుకు తీసుకువెళ్లి గ్రామాలను సస్యశ్యామలంగా చూడాల్సి ప్రభుత్వం, చేసిన అభివృద్ధిని సర్వనాశనం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను పథకాలంలో బంటుమిల్లి ,కృత్తివెన్ను మండలాల్లో చేసిన అభివృద్ధి పనులైనా 16 గ్రామాలలో ప్రజల దాహార్తిని తీర్చే మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం, దాదాపు 50 గ్రామాలలోని పిల్లల ఉన్నత చదువుల కోసం నియోజకవర్గంలోనే బంటుమిల్లి గ్రామంలో నిర్మించిన ఏకైక ప్రభుత్వ డిగ్రి కళాశాలను, ఎండనక, వాననక బస్సులకోసం రోడ్లపై నిలబడి ఆపసోపాలతో ప్రయాణం చేసే ప్రజలకోసం బంటుమిల్లి గ్రామంలో నిర్మించిన బస్ స్టాండును ,పలు గ్రామాలలో నిర్మించిన రోడ్లను మంగళవారం బూరగడ్డ వేదవ్యాస్ పరిశీలించి ఆశ్చర్యానికి గురైయ్యారు. అనంతరం స్థానిక బస్ స్టాండు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం మల్లేశ్వరం నియోజకవర్గంగా వుండే నేటి పెడన నియోజకవర్గంలో మల్లేశ్వరం మేఘ రక్షిత మంచినీటి చెరువు, బంటుమిల్లి బస్ స్టాండు, బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రి కళాశాల, ములపర్రు టు మూలంక, కంచడం, బర్రిపాడు, కొర్లపాడు, సాతులూరు, కృత్తివెన్ను మండలంలోని చినపాండ్రాక, ఇంతేరు, కోమళ్లపూడి ,తదితర గ్రామాలలో గ్రామస్తులకు రోడ్ల సదుపాయలను కల్పించామన్నారు. వాటిని ఇంక అభివృద్ధిని పెంపొందించాల్సిన వైసిపి ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల శ్రీనివాస్ ,కంచడం గ్రామ మాజీ సర్పంచి గంధం సత్యనారాయణ ,పుప్పాల నరసింహారావు, షేక్ సైదాని, జంపన కోటయ్య, దూతల మురళి ,టిడిపి ,జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

రాష్ట్ర స్థాయి 'హాకీ పోటీలకు'

విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జెడ్పీ పాఠశాల జూనియర్, సబ్ జూనియర్ విద్యార్థులు పాల్గొనున్నట్లు హెచ్ఎం వి.కేశవ నారాయణ తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఆంధ్రా జాతీయ కళాశాలలో మచిలీపట్నం లో జరిగిన సబ్ జూనియర్ బాలురు, జూనియర్ బాలికలు హాకీ ఆటలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈనెల బాలికలు 9,10,11తేదిలో శ్రీకాకుళం (జిల్లా) కు ఈనెల 10,11,12 తేదీల్లో కర్నూలు లో జరిగే పోటీలకు వెళ్తతారని తెలిపారు. వీరికి తర్ఫీదిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఇ.వి.నారాయణని ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

9న జాతీయ నులి పురుగుల దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 9వ తేదీన పాఠశాలల్లో నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవం ను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరా సుల్తానా జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం ఆయా పాఠశాలకు చేరాయి. ఇదే విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి-1 ఎస్ శివశంకరరావు, ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి మంగళవారం విలేకరులకు తెలి పారు. ఈనెల 7, 8న విద్యార్థులకు అసెంబ్లీలో తెలిపి నోటీస్ బోర్డ్ పై కూడా రాసి ఉంచాలని ఆమెవివరించారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు : ఉప్పాల

విశాలాంధ్ర-పెడన : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇంచార్జ్, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము పేర్కొన్నారు . పెడన మండలంలోని పెనుమల్లి, నేలకొండపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం ఉప్పాల రాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పెనుమల్లి, నేలకొండపల్లి, చినపుల్లపాడు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి వర్గ ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు అండగా నిలవాలని కోరారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను 100 శాతం అమలు చేసి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. రానున్న సార్వత్రియ ఎన్నికల్లో పెడన నియోజవర్గ ప్రజలందరూ వైయస్ జగన్ ను రెండో దఫా ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి పెడన నియోజకవర్గ శాసనసభ్యునిగా తనను గెలిపించాలని ఉప్పాల రాము కోరారు. ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అచ్యుత్ రావు, వైస్ ఎంపీపీ యాదవరెడ్డి వరప్రసాద్, పెడన వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి రామానాయుడు,, వైసీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, వైసీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, పెడన పట్టణ సచివాలయం మతిన్ ఖాన్, ఎంపీటీసీలు అంకెం గిరిబాబు, బొల్లా ఉదయ్ కుమార్, దావు శీను, ఉచా అనిల్, వైసిపి నాయకులు దావుబారవలింగం,, బండారు చంద్రశేఖర్, కోడూరు శ్రీనివాసరావు, పామర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

పమిడిముక్కల తహశీల్దార్‌గా 'సత్యనారాయణ'

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఎన్నికల బదిలీలో భాగంగా తూర్పు గోదావరి కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నుండి కె.వి.వి.సత్యనారాయణ పమిడిముక్కల మండలానికి తహశీల్దార్ గా భాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డెక్కా రాజ్యలక్ష్మి పశ్చిమ గోదావరి జిల్లా కి బదిలీ పై వెళ్ళారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

వేసవికి సిద్ధమవుతున్న డోకిపర్రు మంచినీటి చెరువులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: వేసవి సమీపిస్తున్న తరుణంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని డోకిపర్రు గ్రామ పంచాయతీ మంచినీటి చెరువులు అయిన అచ్చమ్మ చెరువు, మాతినీడు గుంట, బద్దిరెడ్డి చెరువులకి నీరు నింపుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్ రమేష్ తెలిపారు. గ్రామంలో వేసవికి నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చెరువుల్లో యిప్పటికే ఎనభై శాతం నీరు నింపామన్నారు. సదరు చెరువుల్లోని నీటిని పరీక్ష నిమిత్తం పరీక్ష కేంద్రానికి పంపించగా ప్రజల రక్షిత మంచినీటి అవసరాలకు సరిపోయే నాణ్యత కలిగిన వున్నట్లు నివేదికలు వచ్చివున్నాయని కార్యదర్శి రమేష్ తెలిపారు. కాబట్టి ప్రజల అవసరాలకు ఎటువంటి అవాంతరాలు రాకుండా ముందస్తుగా నీటిని నిల్వచేసి, రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రజలందరికీ రక్షిత మంచినీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని ప్రజలు ఆందోళన చెందవలసిన పరిస్థితి లేదని కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం పెద్ద అవుటుపల్లి లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆశా మరియు ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు మరియు సోషల్ మీడియా దుర్వినియోగంపై నవజీవన్ బాల భవన్ అద్వర్యం వర్కుషాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్ కె నజ్మ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మరియు సోషల్ మీడియా వ్యసనం ఒక మానసిక రుగ్మత, అని సరి అయిన అవగాహనతో ఈ రుగ్మతలను కట్టడి చేయవచ్చు అని అన్నారు, మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, సరైన అవగాహనతో మాదక ద్రవ్యాలను కట్టడి చేయవచ్చు అని, మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్య వ్యాసపరులను గుర్తించి వారిని సంబంధిత పునరావాస కేంద్రాలను సంప్రదించి చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకురావాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల కు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, సరి అయిన అవగాహనా, కౌన్సిలింగ్ మరియు డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని ప్రతి ఒక్కరు తమ వంతు సామజిక భాద్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చు అన్నారు ఈ కార్యక్రమములో పెద్ద అవుటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ డాక్టర్ ఫిలోమిన, సుప్రియ, జీవ కాంత్, ఆశా మరియు ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

నగరాన్ని అందంగా ఉంచుకుందాం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరాన్ని అందంగా తీర్చిదిద్దటంలో నగర పౌరుల పాత్ర కీలకమని నగర పాలక సంస్థ అధికారులకు సహకరించి నగరాన్ని అందంగా తీర్చిదిద్దుదామని నగర పాలక సంస్థకు కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీఎంసీ సర్కిల్-2 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్టు నిర్వహించి కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించేవారికి అపరాధ రుసుం విధించారు. రోడ్లపై చెత్త వేసిన వారికి, మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగించే వారిపై శానిటేషన్ అధికారులు కేసులు నమోదు చేసి మొబైల్ కోర్టులో కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి హాజరుపర్చారు. వీరిపై విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావటంతో 9మందికి రూ.2680 జరిమానా విధించారు. ఒకసారి జరిమానా విధించిన తరువాత మరల రెండవ సారి కూడా కేసు నమోదైతే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు లైసెన్స్‌లు కూడా రద్దు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు కానీ, వ్యాపారస్తులు కానీ రోడ్లపై చెత్త వేసిన, మురుగు ప్రవాహానికి ఆటంకాలు కలిగించినా, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రామకోటేశ్వరరావు, సానిటరీ సూపర్వైజర్-2 నవకిషోర్, శానిటరీ ఇనస్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

124 సార్లు బటన్ నొక్కినా..!
సొమ్ము ప్రభుత్వానిదేగా ..!!

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవల్ని అందించే బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం దాసరి భవన్ లో విలేకర్ ల సమావేశంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు తో కలిసి నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటీర్స్ లో ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలాగా పనిచేస్తున్నారన్నారు. శనివారం జరిగిన ఏలూరు బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 124 సార్లు బట్టన్ మీకోసం నొక్కానని, నాకోసం 2సార్లు నొక్కండి అనే పిలుపును, ఆరవ డివిజన్ ఎర్ర మేడ వద్ద ఉన్న 'కస్టర్ 13, 38వ సచివాలయం' లో వాలంటీర్ గ్రూపులో ఉన్న ప్రజలకు మెసేజ్ చేశారని, ఫ్లే కార్డులో చూపిస్తూ ప్రభుత్వ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. వాలంటీర్స్ కు గౌరవ వేతనం ఇస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నిసార్లు బటన్ నొక్కినా ప్రభుత్వ డబ్బుతోనేనని, జగన్ ఇడుపులపాయ నుండి తెచ్చిన సొంత సొమ్ముతో కాదన్నారు. ప్రభుత్వం ఏదైనా సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిందేనని, మారుతున్న ఆర్థిక భారాలకనుగుణంగా ప్రజా సంక్షేమ పాలన ఉండాలని, క్రొత్తవి సృష్టించిన పెన్షన్లు కాదని పాత పథకాలేనిని తెలిపారు. రాబోయే కాలంలో రాజకీయ పార్టీల కోసం పనిచేసే వాలంటీర్ల వ్యవస్థ పై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేయనున్నామన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా రాజకీయ లబ్ధి సరైన పద్ధతికాదని వైసిపి ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తున్నామన్నారు. రాజకీయ ప్రచారం చేసిన క్లస్టర్13, 38వ సచివాలయం వారిపై చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండకర్ కు సిపిఐ నగర సమితి ఫిర్యాదు చేయడమైనదని తెలిపారు.

మన్నె సాత్విక గృహ నిర్బంధం

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోనిపేరకలపాడు గ్రామ సర్పంచ్, నందిగామ నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షురాలు మన్నె సాత్వికను పోలీసులు గృహం నిర్బంధం చేశారు. రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వై.వి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపు ఇచ్చిన సంగతి విధితమే. ఇందులో భాగంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్ళ కుండా పోలీసులు మన్నె సాత్వికను హౌస్ చేశారు. పోలీసులను అడ్డుపెట్టు కొని తమను గృహనిర్బంధం చేయటం చాలా దౌర్భాగ్యం మని,ప్రభుత్వం తమ స్వేచ్ఛను అడ్డుకుంటున్నదని మన్నె సాత్విక ఆరోపించారు.ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.

కేంద్ర బడ్జెట్లో రైతాంగానికి మొండి చేయి

విశాలాంధ్ర-గంపలగూడెం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు నిరాశ మిగిల్చిందని దేశంలో అత్యధికంగా ఉన్న కౌలు రైతుల ఊసే లేదని ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బడ్జెట్. పై పునసమీక్ష చేసి బడ్జెట్లో. రైతాంగానికి పెద్దపీట వేసి అధిక నిధులు కేటాయించాలని రైతులను కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువూరు నియోజకవర్గం గంపలగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పెట్టుబడి సాయం) ఫసల్ బీమా పథకం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని రుణ ఉపశమన చట్టం ప్రకారం ప్రకృతి విపత్తుల సహాయ నిధి. ధరల స్థిరీకరణ లాంటి పథకాలకు నిధులు పెంచి క్రొత్త పథకాలకు చోటు కల్పించకపోగా రైతుల ఆశలపై నీళ్లు చల్లారని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు 2 లక్షల రూపాయల వరకు అన్ని రకాల పంటలకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని.కౌలు రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు సాగు సాయం కింద 15వేల రూపాయలు సాయం అందించాలని కరువు.తుఫాను వల్ల పంటలు నష్టపోయిన ప్రతి కౌలుదారుకు తక్షణమే ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని. పంటల భీమా పరిహారం ఇవ్వాలని. 2019లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే ప్రతి కౌలు రైతుకు కౌలు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సారవ చూపాలని రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కౌలు రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డేవిడ్ డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ పంటలు వేసి చీడపీడలతో నష్టపోయిన రైతులకు ఏ సంవత్సరం పరిహారం ఆ సంవత్సరం ఇస్తానని నేటికి ఇవ్వపోవడం బాధాకరమని పంట కాలంలోనే నష్ట పరిహారం అందించాలని రైతాంగాన్ని ఆదుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు. ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు సబ్సిడీపై అందించాలని కోరారు. దేశానికి రైతేరాజని పాలకులు ఊక దంపుడు ఉపన్యా సాలు ఇవ్వటమే తప్ప ఆచరణలో చూపించటలేదని వ్యవసాయ రంగం అభివృద్ధి చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని రకాల పంటలపై బ్యాంకు రుణాలు రద్దు చేయాలని పాలకులు తమ స్వార్థ ప్రయోజనం మానుకొని అన్నం పెట్టే రైతులను ఆదుకోవాలని బడ్జెట్లో అధిక నిధులు వెచ్చించి రుణాలు మంజూరు చేయాలని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరువూరు నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఉన్నం సాంబశివరావు. నృసింహాద్రి వనమాలి. కౌలు రైతుల సంఘం జిల్లా సమితి సభ్యులు ముచ్చింతల వెంకటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా రామకృష్ణలు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి జీవితఖైదు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): మైనర్‌పై తన కూతుర్ని అత్యాచారం చేసిన కేసుల్లో కన్న తండ్రికి జీవిత ఖైదు శిక్ష పడింది. మంగళవారం పోక్సో కోర్ట్ స్పెషల్ న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని తీర్పు వెల్లడించారు. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలికలు గన్నవరంలోని హాస్టల్ ఉంటూ ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. గత ఏడాది జనవరి 10వ వతేదీన బాలికలు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చారు. అదే రోజు సాయంత్రం ఓ మైనర్ బాలికను తండ్రి బైక్ పై ఎక్కించుకుని రామవరప్పాడు ఫ్లేవోర్ నిర్మాష్య ప్రదేశంలో తీసుకుని వెళ్లి అత్యాచారంకు పాల్పడ్డాడు. బాలిక అశ్లీల వీడియో తీసి బాలికను బెదిరించి పదేళ్ల వయస్సు నుంచి అత్యాచారంకు పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లికి తెలియజేసింది. దీంతో తల్లి దిశ పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది 12వ తేదీన ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు కఠారి నాగరాజును అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడి పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డాక్టర్ రజనీ జీవిత ఖైదు శిక్ష విధించారు. అలాగే బాలికకు రూ.5లక్షల నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి, దిశ ఏసీపీ వివి.నాయుడు, సీయంయస్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది సాక్షులను విచారించారు.

ఉయ్యూరులో ... ఉద్రిక్తత

విశాలాంధ్ర-ఉయ్యూరు: ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబు రాజేంద్ర ప్రసాద్ ను ఇంటి వద్ద పోలీసులు అడ్డుకోవడంతో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ హక్కుల సాధన కోసం ఛలో అసెంబ్లీ, ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులకు రాజేంద్ర ప్రసాద్ ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. నిర్బంధం నుంచి రాజేంద్రప్రసాద్ బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైవీబీ అనుచరుల కు, పోలీసులకు తీవ్రంగా తోపులాట జరగడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. తన అనుచరులతో వైవీబీ రోడ్డుపై బైఠాయించి టైర్లు కాల్చి తమ నిరసనను వ్యక్తం చేస్తూ ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల నిర్బంధం తో ... ప్రభుత్వాలను నడపలేరని, సర్పంచ్ ల దెబ్బకు ప్రభుత్వం దిగిరావాల్సిందేనని ఈ సంధర్భంగా రాజేంద్రప్రసాద్ అన్నారు. రెండు రోజులుగా జిల్లాలోని ప్రతిపక్ష సర్పంచ్ లను ముందస్తు గా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసులు భారీగా మెహరించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ లు గణేష్, అర్జున్ లు చర్యలు తీసుకున్నారు.

స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన స్టాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలను కలెక్టర్, జేసీ సంపత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు, ఒక పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను భద్రపర్చేందుకు వీలుగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్‌కు అనువుగా ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా చూడాలని, టాయిలెట్లు నీటి సరఫరా సక్రమంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన గదులను రూట్ మ్యాప్‌లను పరిశీలించి ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వీ.శ్రీనివాసరావు, ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

స్టాకు వివరాలు పోర్టల్‌లో ఉంచాలి : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కేంద్రం ఆదేశాల మేరకు ధాన్యం, బియ్యం వ్యాపారులు రిటైలర్లు, చిల్లర వ్యాపారులు, మిల్లర్లు బియ్యం లేదా వడ్లు స్టాక్ వివరాలను అందుబాటులో ఉండేలా పొందుపర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక జేసీ కార్యాలయంలో జేసీ మంగళవారం రైస్ మిల్లర్లు, రైస్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, ధాన్యం, బియ్యం వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ వివరాలను కేటగిరీల వారీగా బియ్యం, నూకలు, బాత్మతి, తెల్లని, పారా బాయిల్ రైస్, వరి వివరాలను పోర్టల్‌లో విడిగా ప్రతి శుక్రవారం తప్పకుండా పొందుపర్చాలన్నారు. నిర్లక్ష్యం వహించి ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల అధికారి మోమన్‌బాబు, ధాన్యం, బియ్యం వ్యాపారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు రాత్రి అన్నప్రసాదం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పాలక మండలి ఛైర్మన్‌గా కర్నాటి రాంబాబు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా భక్తులకు ట్రస్ట్ బోర్డ్ ద్వారా పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కర్నాటి రాంబాబు తెలిపారు. దేవస్థానంలో రాత్రి కూడా భక్తులకు అన్నప్రసాదం కల్పించనున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం కుంకుమ ప్రసాదం, పాదుకలు, శటగోపం, నూతన వధువు వరులకు ఉచితంగా అంతరాలయం దర్శనం, ఆశీర్వచనం కల్పిస్తాన్నారు. భక్తులకు దుర్గాఘాట్‌లో నది స్నానాలకు అనుమతి ఇస్తామన్నారు. పొంగలి షెడ్డు నిర్మాణం అంబాటులో ఉంచడం, ఉచిత బస్సులు కొండపైకి నుంచి దుర్గాఘాట్ వరకు, దుర్గాఘాట్ నుంచి కొండపైవరకు బస్సుల సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.

రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మల ఆశీస్సులు జగనన్నకే: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల: పెండ్యాల గ్రామంలో "గడపగడపకు -మన ప్రభుత్వం" కార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందుతున్న ఆర్థిక లబ్ధి వివరాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివక్షలంచాలకు తావు లేకుండా పారదర్శక పాలన సీఎం వైయస్ జగన్ అందిస్తున్నారన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధిని జమ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా వైయస్ జగన్ పనిచేస్తున్నారు.జగనన్న పాలనలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ సిబ్బంది అంతా ప్రజల ఇళ్ళ వద్దకు వెళ్లి పథకాలను అందజేస్తున్నారు అన్నారు.గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా వైయస్ పరిపాలన నిలిచింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దీవెనలసిరి... గుణదలమాత పుణ్యక్షేత్రం

విశాలాంధ్ర - విజయవాడ (ఎడ్యుకేషన్) : కొండపై కొలువైన లూర్దుమాత తనను ఆశ్రయిస్తున్న వారి మానవులను ఆలకిస్తూ తన అనుంగ బిడ్డలుగా ఆదరిస్తూ భక్తులపాలిట దీవెనల సిరిగా వెలుగొందుతుందని హైదరాబాద్ పునీత యోహాను ప్రాంతీయ గురు విద్యాలయం రెక్టర్ రెవ. ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి అన్నారు. గుణదలమాత శతాబ్ది మహోత్సవ నవదిన ప్రార్థనలలో భాగంగా మంగళవారం సాయంత్రం జరిగిన 7వ రోజు నవదిన ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిస్తూ మరియతల్లి దేవునితల్లి అయినప్పటికీ ఏసుప్రభువు పట్ల ఎప్పుడు వినయ విధేయలతో, భక్తిశ్రద్ధలతో మెలిగిందని తెలిపారు. ఆమె మధ్యస్థ ప్రార్థన ద్వారా భక్తులమైన మనం దేవుని చేరుకోవచ్చునని పేర్కొన్నారు. విజయవాడ కతోలికపీఠం మోన్సిన్యోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడుతూ గత ఏడురోజులుగా అనేక ప్రాంతాల నుండి అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు నవదిన ప్రార్థనలలో పాల్గొని గుణదలమాత చల్లని దీవెనలు పొందుతున్నారని తెలిపారు. అంతకుముందు గుణదలమాత పుణ్యక్షేత్రం నుండి ముఖ్యఅతిథి ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డితో కలసి మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, తదితర గురువులు "దివ్యసత్ప్రసాద మందసంతో" కొండపైకి లూర్దుమాత వద్దకు చేరుకున్నారు. అనంతరం లూర్దుమాత స్వరూపం వద్ద గురువులు "సమిష్టి దివ్యపూజాబలి" సమర్పించారు. సత్యనారాయణపురం, వేల్పూరు, అజ్జంపూడి తదితర విచారణల నుండి వచ్చిన భక్తులు యువతీ యువకుల కోసం, నిరుద్యోగుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొలకాని మరియన్న, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ కారెం శేఖర్, ఫాదర్ బి. రాజు, మఠకన్యలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీయుత ఏడవ అదనపు జిల్లా జడ్జ్, ఒంగోలు వారి కోర్టులో

I.A. No.246/2023 M.V.O.P.No.205/2019

ప్రళయ కావేరి పాపమ్మ మరియు ఇతరులు - పిటీషనర్స్

Vs

జి.రాంబాబు మరియు ఇద్దరు - రెస్పాండెంట్స్

నోటీసు

(Order 9 Rule 4 Notice)

To

R1. జి.రాంబాబు, **S/o.** లక్ష్మణ స్వామి, డోర్ నెం.61-11-5, వార్డ్ నెం.14, కృష్ణలంక, విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా.

R3, షేక్ పఠీష్, **S/o.** మొహిద్దీన్, డోర్. నెం.75-14-106, భవానీపురం, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్.జిల్లా.

పై నంబరు గల **I.A. No.246/2023 in M.V.O.P.No.205/2019**లో **Order 9 Rule 4** నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టుద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు తెలియపర్చడమైనది, కావున మీరు తేదీ **23-02-2024**న ఉదయం **10గం॥30ని॥**లకు పై కోర్టులో స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది తేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేదీ : **23-02-2024.**

జి.బాలాజీ రావు, అడ్వొకేట్, ఒంగోలు

శ్రీయుత ఏడవ అదనపు జిల్లా జడ్జ్, ఒంగోలు వారి కోర్టులో

I.A. No. 245/2023 M.V. O.P.No. 192/2019

వాయిల బుజ్జమ్మ మరియు ఇతరులు - పిటీషనర్స్

Vs

జి. రాంబాబు మరియు ఇతరులు - రెస్పాండెంట్స్

నోటీసు

(Order 9 Rule 4 Notice)

To

R1: జి. రాంబాబు, **S/o.** లక్ష్మణ స్వామి, డోర్ నెం. 61-11-5, వార్డ్ నెం.14, కృష్ణలంక, విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా.

R3: జి. రాంబాబు, **S/O.** లక్ష్మణ స్వామి, డోర్ నెం.61-B/1-11-5, సత్యనారాయణ నగర్, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా.

పై నంబరు గల **I.A. No. 245/2023 in M.V. O.P. No. 192/2019**లో **Order 9 Rule 4** నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు తెలియపర్చడమైనది. కావున మీరు తేదీ **23-02-2024** న ఉదయం **10 గం.30 ని.**లకు పైకోర్టులో స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయుటమైనది.

కోర్టువారి ఉత్తర్వులతో

వాయిదా తేదీ **23-02-2024.**

జి బాలాజీ రావు, అడ్వొకేట్, ఒంగోలు.

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ విజయవాడ

O.S.NO. 27 /2021

Between:

వేపూరి లక్ష్మి పద్మజ - వాది

మరియు

మండపాక వీర రాఘవమ్మ & ఫోర్ అథెర్స్ - ప్రతివాదులు

టు

2) కాకర్ల సత్యవతి, భర్త సోమేశ్వరరావు, నివాసము రామాలయము వీధి, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండల్ 521108, ఎన్.టీ.ఆర్.డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్. **(2వ ప్రతివాది)**

4) వరకూటి శైలజ రాణి, భర్త కృష్ణార్జునరావు, నివాసము, డోర్ నెం. 4-149, ఆంధ్రప్రదేశ్ సీడ్స్ కార్పొరేషన్ దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండల్-521108, ఎన్.టీ.ఆర్.డిస్ట్రిక్ట్. **(4వ ప్రతివాది)**

పై నెంబర్ దావాలో పలుమార్లు సమన్లు పంపినప్పటికీన్నీ మీరు పై కోర్ట్‌వారి ఎదుట హాజరు కానందున మీరు ది. **28-03-2024**వ **తేదీన ఉదయం గం. 10-30 నిం, లకు** పై కోర్ట్ వారి ఎదురు హాజరు కావలెను లేని యెడల మీ పరోక్షములో తగిన ఉత్తర్వులు జారీ చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

శ్రీ మధిర శ్యామలరావు, న్యాయవాది, విజయవాడ

విజయవాడ, ది: 07-02-2024.

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ విజయవాడ

I.A.No.10/2021 IN O.S.NO. 27 /2021

Between:

వేపూరి లక్ష్మి పద్మజ - పిటీషనర్

మరియు

మండపాక వీర రాఘవమ్మ & ఫోర్ అథెర్స్ - రెస్పాండెంట్స్

టు

2) కాకర్ల సత్యవతి, భర్త సోమేశ్వరరావు, నివాసము రామాలయము వీధి, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండల్-521108, ఎన్.టీ.ఆర్.డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్. **(2వ రెస్పాండెంట్)**

4) వరకూటి శైలజ రాణి, భర్త కృష్ణార్జునరావు, నివాసము, డోర్ నెం. 4-149, ఆంధ్రప్రదేశ్ సీడ్స్ కార్పొరేషన్ దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండల్-521108, ఎన్.టీ.ఆర్.డిస్ట్రిక్ట్. **(4వ రెస్పాండెంట్)**

పై నెంబర్ దావాలో పలుమార్లు సమన్లు పంపినప్పటికీన్నీ మీరు పై కోర్ట్‌వారి ఎదుట హాజరు కానందున మీరు ది. **28-03-2024**వ **తేదీన ఉదయం గం. 10-30 నిం, లకు** పై కోర్ట్ వారి ఎదురు హాజరు కావలెను లేని యెడల మీ పరోక్షములో తగిన ఉత్తర్వులు జారీ చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

శ్రీ మధిర శ్యామలరావు, న్యాయవాది, విజయవాడ

విజయవాడ, ది:07-02-2024.

స్మార్ట్ కార్డ్స్ ఆర్సీ డీఎల్ అందజేత
రిటర్న్ కార్డ్స్‌కు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు-డీటీసీ పురేంద్ర

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : పోస్టు ద్వారా తిరిగివచ్చిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సుల స్మార్ట్ కార్డులను కార్యాలయంలో అందజేయడం జరుగుతుందని వాహన యజమానులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని డీటీసీ ఎం.పురేంద్ర మంగళవారం తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్లు వాహనాల బదిలీల సమయాల్లో పేర్కొన్న చిరునామా ప్రకారం పోస్టు ద్వారా స్మార్ట్ కార్డులను పంపించడం జరిగిందని, వాటిని వాహన యజమానులు అందుకోలేని కారణంగా ఆర్సీ డ్రైవింగ్ లైసెన్సుల స్మార్ట్ కార్డులు తిరిగి కార్యాలయంనకు వచ్చాయన్నారు. పరివాహన్ వెబ్‌సైట్‌లో నమోదైన కొత్త రిజిస్ట్రేషన్లు, వాహన బదిలీలకు సంబంధించి ఆర్సీలను, డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్‌కు సంబంధించిన డీఎల్ కాపీలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

రాజకీయ పార్టీలతో కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పొలిటికల్ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొలిటికల్ పార్టీల ప్రతినిదులు తెలిపిన సమస్యలకు పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, వచ్చిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల వివరాలను రాజకీయ పార్టీ ప్రదినిదులకు వివరించారు. ఈ సమావేశంలో ఎన్.వీరభద్రరావు (సీపీఐ), నవనీతం సాంబశివరావు(టీడీపీ), గుండేసుందర్పాల్ (వైసీపీ), సీహెచ్.శ్రీనివాస్ (సీపీఐఎం), వినోద్ కుమార్ (బీఎస్పీ), వీఎంసీ సీపీ ప్రసాద్, సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, సెంట్రల్ ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ మధురానగర్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. గతంలో అధికారులకు ఇచ్చిన గడువుకు కాంట్రాక్టర్లు పనులు ఎంత వరకు పూర్తి చేసిందీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోపు పనులు పూర్తి చేయాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకటవ డివిజన్ గుణదల నున్న రోడ్డులో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఎక్కడున్న మట్టికుప్పలను తక్షణం తొలగించాలని శానిటరీ ఇనస్పెక్టర్‌లను ఆదేశించారు. పారిశుద్ధ నిర్వహణ నిరంతరం జరుగుతుండాలని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని. సైడ్ కాలువల్లో క్రమం తప్పకుండా పూడికలు తీసి దోమలను నియంత్రించాలన్నారు. నిత్యం కాలువల్లో దోమల మందు కొడుతూ ఉండాలని, దోమల బారి నుండి త్వరగా బయటపడేందుకు ఫాగింగ్ ను పెంచాలని శానిటరీ ఇనస్పెక్టర్లును ఆదేశించారు. దోమల సమస్యను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రతి డివిజన్‌కి ఇద్దరు మలేరియా వర్కర్లను కేటాయిస్తూ నిరంతరం యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహించి దోమల సమస్యను అరికట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా హైవే బస్టాండ్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : 65 వ జాతీయ రహదారి ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న హై వే బస్టాండ్ ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్ ఆఫీసర్ వై.దానం,మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, డి ఈ శివ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్.

విశాలాంధ్ర-మైలవరం : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలం(బాలికల జూనియర్ కళాశాల) వివేకానంద పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ పాస్ట్ గవర్నర్ ఏ కోటిరెడ్డి , లయన్స్ క్లబ్ జిల్లా కెరియర్ గైడెన్స్ కోఆర్డినేటర్ ఎం సాంబశివరావులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. ప్రతి విద్యార్థికి పట్టుదల కృషి ఎంతో అవసరం అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు కు ఎలా ప్రిపేర్ అవ్వాలి, టెన్త్ తర్వాత ఏ కోర్సులు తీసుకుంటే బాగుంటుందో వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలవాది హరీష్ కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మన దినేష్ బాబు, లయన్స్ క్యాబినెట్ మెంబర్ పి రాజారెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ మద్దినేని శ్రీనివాస్ రావు, లైన్ మెంబర్ తాడేపల్లి వెంకటేశ్వరరావు, ప్రభుత్వబాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలును పరిశీలించిన లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ

విశాలాంధ్ర- నందిగామ: కృష్ణాజిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణయ్య నందిగామ సబ్ జైలు పరిశీలించేందుకు మంగళవారం వచ్చారు. వారిని నందిగామ సీనియర్ సివిల్ జడ్జ లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్ మరియు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం రేష్మ అందరూ సబ్ జైల్ విజిట్ చేసి అనంతరం నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ని శాలువాతో ను పుష్పగుక్షములతో నూ సన్మానించి నూతన కోర్టు భవనమును వివరించి త్వరలో ఓపెనింగ్ డేటును ఫిక్స్ చేయుటకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కి వివరించవలసినదిగా తెలియజేసినారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బిళ్ళ పాటి భాస్కర రావు,ప్రధాన కార్యదర్శి పి ప్రకాష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ షేక్ అజాద్, ఏజిపి మట్టా ప్రసాద్, న్యాయ వాదులు కొమ్మినేని మౌళేశ్వరరావు, కొనకంచి శ్రీనివాసరావు, ఫణి కుమార్, సిహెచ్ రవికుమార్,వేల్పుల ప్రభాకర్ రావు, వేల్పుల స్వామి తదితరు న్యాయవాదులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నివేశన స్థలాలు రిజిస్ట్రేషన్లు వేగవంతం

విశాలాంధ్ర -కూచిపూడి : జగనన్న కాలనీలో నివేశన స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని మొవ్వ మండల తహసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, ఎం.డి.ఓ. జి చంద్ర శేఖర రావులు సూచించారు. అధికారులు ఇద్దరు మంగళవారం సాయంత్రం కూచిపూడి సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషనులపనితీరును పరిశీలించారు. కూచిపూడి లో 222 వివేశన స్థలాలకు 85 పూర్తి అయినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. సర్వర్ మధ్య మధ్యలో ఇబ్బందులు పెట్టడంతో అనుకున్న రీతిలో ఉచిత రిజిస్ట్రేషన్లుచేయలేకపోతున్నామనిసచివాలయ సిబ్బంది వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆన్లైన్ లో జరిగే రిజిస్ట్రేషన్.విధానాన్ని పరిశీలించారు. వీరితోపాటు డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ గోపాల్ రావు, కూచిపూడి పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని, గ్రేడ్ 5 కార్యదర్శి కే .ఆంజనేయులు, విఆర్వో ఎం.ఖాశిం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ అధికారులు శాఖా పరమైన వివరాలను సేకరించారు. అంతకుముందుగా పెదపూడి సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించి వివరాలను గ్రేడ్ 5 కార్యదర్శి లోయ కళావతి, వీఆర్వో జె.కోటేశ్వరరావుల ద్వారా సేకరించారు. పెదపూడి లో 245 నివేశనస్థలాలకు 86 పూర్తి అయినట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే పాఠశాలల్లో గల ఎన్నికల కేంద్రాలను కూడా పరిశీలించారు.

పుప్పాల అంజనేయులు గొప్ప నాయకుడు : వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గుడివాడ : ఆంజనేయులు చేసిన రాజకీయ పోరాటాలు ఎంతో మంది యువతకు అదర్శం కావలని టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక పాటిమిద పుప్పాల అంజనేయులు 10వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీలు), జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి వెనిగండ్ల రాము పాల్గొని అంజేయులు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమలు వివారించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గోకరకొండ బలరాం, సానా భోగేశ్వరరావు, వసంతవాడ దుర్గారావు, టిడిపి నాయకులు పంద్రాజు సాంబశివరావు, సుంకర గాంధీ, దారపు రెడ్డి మణిశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువు

- అందుకే కూటమి కట్టి పోటికి ప్రయత్నాలు
- వైసీపీ ఒక్కటే రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటి చేస్తుంది
- వైసీపీ విజయవాడ వెస్ట్ ఇన్‌చార్జ్ ఆసీఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువైయ్యారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ఆసీఫ్ అన్నారు. మంగళవారం విజయవాడ 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆసీఫ్ మాట్లాడుతూ అందుకే చంద్రబాబు నాయుడు కూటమి కట్టి పోటికి ప్రయత్నాలు చేస్తున్నాడని చెప్పారు. వైసీపీ ఒక్కటే రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసినా ద్రోహి చంద్రబాబు నాయుడు అని అన్నారు. టీడీపీ పరిస్థితి పైన పటారం లోన లోటారం అన్నట్లుగా ఉందన్నారు. ఎన్నికల పోటికి అభ్యర్థులు దొరక్క ఆ పార్టీ తలలు పట్టుకుంటోందన్నారు. పోటి చేయడానికి ఎవరు ముందుకు రావడంలేదన్నారు. దీంతో చంద్రబాబు కూటమి కట్టి పోటికి దిగుతున్నారన్నారు. వైసీపీని ఎదుర్కొనలేకనే ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయన్నారు. ఇప్పటికి సీం జగన్ పై జనంలో అభిమానం చెక్కుచెదరలేదని చెప్పారు. విస్తృతంగా సంక్షేమ పథకాలు, కరోనా కాలంలోనూ ప్రజలకు చేదోడుగా నిలవడంతో జగన్ పై ప్రజలు ప్రత్యేక అభిమానం పెంచుకున్నారన్నారు. జగన్ పాలనలో ఎలాంటి స్కాములు లేకుండా స్కీముల కొనసాగుతోందన్నారు. వాలంటీర్లు, గృహ సారధులు ప్రతి 50ఇళ్లకు అందుబాటులో ఉండటమే కాకుండా, ఎమ్మెల్యేలు, ఎంపీలు నిత్యం ప్రజల్లోకి ఉంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ సీటు గెలిచి జగన్‌కు గిఫ్ట్‌గా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, మహాదేవ్ అప్పాజీ, పెద్దబాబు, డివిజన్ అధ్యక్షుడు సుధీర్, దళిత నాయకులు కెనాడీ, చెరుకూరి శ్రీను, డివిజన్ మహిళా అధ్యక్షులు తంగిరా ప్రమీల తదితర నేతలు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి విజయవాడలో ప్రాంతీయకేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పించింది. దీనికోసం అమరావతి, రాయపూడి గ్రామంలో ప్రభుత్వం నుండి భూమిని కొనుగోలు చేసి, ఫిబ్రవరి 7వతేదీన భారత విద్యాశాఖామాత్యులు ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా ఆన్‌లైన్ వేదికగా శంఖుస్థాపన చేయనున్నారు. దీనితోపాటు దేశంలోని మరో ఆరు ప్రాంతీయ కేంద్రాల శాశ్వత భవనాల ప్రారంభోత్సవం కూడా ఆన్‌లైన్ విధానంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నారు.విజయవాడ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. కె. సుమలత ఆధ్వర్యంలో రాయపూడి గ్రామంలో జరిగే భూమిపూజ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఒడిశాలోని అన్గుల్ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు, డాక్టర్. మనోజ్ కుమార్ దాస్ అతిధులుగా పాల్గొంటున్నారు. భూమిపూజ అనంతరం సిపిడబ్ల్యుడి కార్యాలయంలో నిర్వహించబోయే కార్యక్రమంలో ఇగ్నో అధికార్లు, సిపిడబ్ల్యుడి ఇంజనీర్లు, ఇగ్నో అధ్యయనకేంద్రాల ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి భారత విద్యాశాఖామాత్యులు ధర్మేంద్ర ప్రధాన్ అంతర్జాల వేదికగా ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో సిపిడబ్ల్యుడి ముఖ్య ఇంజనీరు ఎమ్. వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజనీరు, కె. కృష్ణకిశోర్, ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకులు డాక్టర్ ప్రసాద్ బాబు, సహాయ కులసచివులు సి. బాలచందర్ తదితరులు పాల్గొంటున్నారు.

జగనన్న పాల వెల్లువను సద్వినియోగం చేసుకోండి : సర్పంచ్ మౌనిక

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం మౌనిక, సచివాలయం సిబ్బంది, పాడి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పాడి రైతులు అందరు సద్వినియోగం చేసుకొని లాభాలు పొందాలని సూచించారు.

సెంట్రల్ నియోజకవర్గాన్ని బ్రాహ్మణులకు కేటాయించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని బ్రాహ్మణులకు కేటాయించాలని బ్రాహ్మణ ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాస రామానుజ చారి డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బ్రాహ్మణలకు కనీసం 5 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. వివిధ జిల్లాల నుండి ఎవరైనా పాల్గొంటే వారికి ఆర్థికంగా, సామాజికంగా, సహకారం అందిస్తామని తెలిపారు. ఇప్పుడున్న అన్ని రాజకీయ పార్టీలు మా సామాజిక వర్గానికి న్యాయం చెయ్యలేదన్నారు. అత్యధిక జనాభా కలిగి మా పరిధిలో ఉన్న విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం ఇప్పుడు వేరే సామాజిక వర్గాలకు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జనాభా దామాషా ప్రకారం బ్రాహ్మణులకు సీటు కేటాయించే వరకు పోరాడతామని అన్నారు జొన్నలగడ్డ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణులకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించే వరకు బ్రాహ్మణ సంఘాలన్నీ ఒకేతాటిపైకి వచ్చి పోరాటం చేస్తామన్నారు. బ్రాహ్మణులు రాజకీయభివృద్దే లక్ష్యంగా తమ పోరాట ప్రణాలికను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బ్రాహ్మణ ఐక్యవేదిక జనరల్ సెక్రటరీ కలపాటి శేషన్ మురళి పాల్గొన్నారు.

రైస్‌మిల్ యాజమాన్యాల మొండి వైఖరి విడనాడాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో 100 రైస్ మిల్లులో పనిచేస్తున్న జట్టు కార్మికులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని రైస్ మిల్ జట్టు కార్మిక సంఘం (ఐఎఫ్ టి యు అనుబంధం) ప్రధాన కార్యదర్శి చీకట్లో వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లులో పని చేస్తేన్న జట్టు కార్మికులకు నూతన అగ్రిమెంట్ కోరకు రాష్ట్ర లేబర్ కమిషనర్ శేషగిరి బాబు ఐఏఎస్ సమక్షంలో యాజమాన్యాలకు కార్మికులకు మధ్య జరిగిన చర్చలు సఫలీకృతం కాకపోవటంతో మరొకసారి చర్చలకు చర్చించుకుని రావాలని యాజమాన్యాలకు కమిషనర్ తెలియజేసాన్నారు.పెరిగిన ధరలకు అనుగుణంగా జట్టు కార్మికుల నూతన అగ్రిమెంట్ చేయడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అధికారులు చొరవతో రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో జరిపిన చర్చలు విఫలం కావడానికి యాజమాన్యాల మొండి వైఖరి కారణమని విమర్శించారు. రెండున్నర సంవత్సరాల క్రితం చేసుకున్న అగ్రిమెంట్ తిరిగి పునరుద్దరించవలసిన అవసరం ఉందన్నారు. లోడింగ్ అన్ లోడింగ్ చార్జీలు పెంచకుండా రెండున్నర సంవత్సరాల క్రితం చేసుకున్న రేట్లను యాజమాన్యాలు ఇస్తున్నాయని, కార్మిక చట్టాలను ఇక్కడ అమలు చేయడం లేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మిక చట్టాల అమలుకు చొరవ చూపాలని కోరారు. గత పది నెలలుగా రైస్ మిల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్నారని గుర్తు చేశారు.భారత కార్మిక సంఘాల సమైక్య ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రామకృష్ణ మాట్లాడుతూ కార్మిక హక్కులు మానవ హక్కుల్ని అమలు చేయకపోవడం మానవ హక్కుల ఉల్లంఘునే అని ప్రభుత్వం వెంటనే రైస్ మిల్లు జట్టు కార్మికులకు కూలి రేట్లు చట్టబద్ధ సౌకర్యాలు అమలుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు కార్మికుల న్యాయమైన డిమాండ్ల కొరకు ఐఎఫ్టియు పోరాడుతుందని కార్మికులు సంఘటితంగా తమ డిమాండ్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు ఆర్ .కనకారావు, ఇప్టూ నగర అధ్యక్షుడు కె. రవీంద్ర, రైస్ మిల్ జట్టు నాయకులు నల్ల శ్రీను, కంబాల సత్తిబాబు చల్లా శ్రీను, గంధం శ్రీను, గేదెల సూరిబాబు సూరంపూడి గంగరాజు తదితరులు పాల్గొన్నారు

సర్వేల పేరుతో ఎస్సీ ఎమ్మెల్యేలను మార్చుతూ అన్యాయం చేస్తున్నారు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సర్వేల పేరుతో ఎస్సీ ఎమ్.ఎల్.ఏ లను మారుస్తూ వారి గొంతు కోస్తూ ఒక నియంతగా వ్యవహరిస్తున్నారని ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర రావు మాదిగ అరోపించారు. మంగళవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వుడ్ నియోజక వర్గాల్లో ఓ.సి నాయకుల్ని పెత్తందారులుగా నియమించి ఎస్సీ ఎమ్.ఎల్.ఏ లకు అధికారం లేకుండా పరిపాలన మొత్తం జగన్ సి.యమ్ సీట్లో కూర్చొని చేశారు.ప్రస్తుతం సర్వేల పేరుతో ఎస్సీ ఎమ్.ఎల్.ఏ లను మారుస్తూ వారి గొంతు కోస్తున్నారని విమర్శించారు. పేరుకే ఎస్సీలలో 5 గురికి మంత్రి పదవులు ఇచ్చారు. ఎమ్.ఎల్.సి అనంత బాబు దళితుడ్ని చంపి డోర్ డెలివరీ చేసి రిమాండ్‌కు వెళ్ళి వస్తే అతనిని పక్కన కూర్చోబెట్టుకుని రాజకీయం చేస్తున్నారు.ఇదేనా నా ఎస్సీ, నా ఎస్టీ అంటే అన్నారు.ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బి.జె.పి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తమ చిత్త శుద్ధిని చాటుకోవాలి.అలాగే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణనకు అనుకూలంగా ముఖ్యమంత్రి జగన్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలన్నారు.రానున్న ఎన్నికల్లో మాదిగ ఉపకులాలకు రాజకీయంగా సీట్ల పంపిణీలో సమన్యాయం చేయాలనే డిమాండ్లపై ఈ నెల 19న కందుకూరి కళ్యాణ మండపంలో భవిష్యత్ కార్యచరణపై రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో నిర్ణయిస్తామన్నారు.ఈ సమావేశంలో కలపాల సురేష్, మల్లాది ప్రసాద రావు ఆలేటి యేసు పాదం, పాలవాయి దాసు, చినబాబు, ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం లేదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి యుద్ధానికి నేను సిద్ధం తోడేళ్ళు గుంపు సిద్ధమా అంటున్నారని అందులో ఆయన అహంకారం కనిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరమ్ ఫర్ అధ్యక్షులు నేతి మహేశ్వరరావు తెలిపారు.మంగళవారం గాంధీనగర్లఓని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ 5సం,,రాలలో ఏమి రాష్ట్రానికి అభివృద్ధి ఏం చేశారు మీరు బహిరంగ చర్చకు సిద్ధమా,మీ చీకటి వ్యాపారాలు చేశారు తప్ప రాష్ట్రానికి ఏమైనా మేలు చేశారా అని ప్రశ్నించారు.రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత సానుభూతి మీద గెలిచారు తప్ప వేరే ఏం లేదు రాజకీయ వారసత్వం లేకపోతే మీరు జీరో అన్నారు.ఏపీనీ దారుణమైన పరిస్థితికి తీసుకువచ్చారు, రాజశేఖర్ రెడ్డి విధానాల పైన అసలు మీకు అవగాహన ఉందా అన్నారు. మద్యపాన నిషేదం చేస్తానని చెప్పావు అది నేరవెర్చరా, నీ సొంత చెల్లెలు మీద, సొంత పుట్టుక మీద సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారం చేస్తుంటే వాటిని ఖండించలేని స్థితిలో మీరు ఉన్నారు. ఉచితాలు ఇస్తేనే ఏపీలో అధికారంలోకి వస్తామని ఒక జాడ్యాన్ని తీసుకొచ్చావు. 7లక్షల కోట్లు అప్పు తెచ్చావు, 3లక్షల కోట్లు కార్పొరేషన్ల ద్వారా అప్పు తెచ్చావు మొత్తం రాష్ట్రానికి 10లక్షల కోట్లు అప్పులు చేసావు. బటన్ నొక్కాను అంటున్నావు ఒక్కక్క మనిషి మీద 4లక్షల 50వేలు అప్పు ఉంది మరి దాని పరిస్తితి ఏంటి.బీజేపీకి మీరు బి టీమ్ గా పనిచేస్తున్నారు మీరు లౌకికవాదులు ఎలా అవుతారు, నీ పార్టీని ఓడించటమే కాదు నీ పార్టీని రాష్ట్రంలో లేకుండా చెయ్యాలని ప్రజలు అనుకుంటున్నారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు,బొప్పన రాజశేఖర్‌రావు,ఎన్‌పి సురేష్,పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్‌ఎంపీల సేవలు అవసరం

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యుల వైద్య సేవలు చాలా అవసరమని డాక్టర్ వి. బ్రహ్మ రెడ్డి అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో ఆంధ్రప్రదేశ్ సామాజిక వైద్య సహాయకుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర మహాసభ కౌన్సిల్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్‌ఎంపీలకు 2007-2008లో ప్రజలకు వైద్యం అందించాలి అంటే ఏం చేయాలి, జబ్బులు వస్తే కూడా తక్కువ ఖర్చుతో ఎలా నయం చెయ్యాలని 230 వీడియోలు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు ఏ స్థాయి వైద్యం చేయొచ్చు, ఏది చేయకూడదనేది ఈ శిక్షణ ద్వారా వాళ్లకు నేర్పించామన్నారు. ప్రైవేట్ డాక్టర్లు గాని, ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు గాని ఈ రకమైన శిక్షణ ఇచ్చినట్టైతే చాలా మందికి ఉపయోగం ఉంటుందన్నారు. ఆర్‌ఎంపీలందరికీ శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వైద్యం ఆర్‌ఎంపీ డాక్టర్లు వైద్యం చేయొచ్చని నిర్ణయించి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 60వేల ఆర్‌ఎంపీ డాక్టర్లు గ్రామీణ వైద్యం చేస్తున్నారని తెలిపారు. వీరి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వం ఈ సర్టిఫికెట్లు ఇస్తే కోరుకున్న ప్రతి పల్లెకు తక్కువ ఖర్చుతో వైద్యులు ధైర్యంగా వైద్యం అందిస్తారని వివరించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వకండి

విశాలాంధ్ర-పెడన : రాబోతున్న వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు మంచినీరు సక్రమంగా అందించాలని పెడన మున్సిపల్ చైర్పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకుమంగళవారం పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్స్ నందు మినీ జెసిబి తో జంగిల్ క్లియరెన్స్ చేయించి వాటర్ వర్క్స్ లో పనిచేయుచున్న సిబ్బందికి ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలనిఆదేశించారు.

23వ భారత్ రంగస్థల్ మహోత్సవ్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : అంతర్జాతీయ నాటకోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా , మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఎపి రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత సంస్కృతి సమితి సహకారంతో ఈనెల 11వ తేదీ వరకు ఆరు రోజులపాటు జరిగే ఆరు నాటక ప్రదర్శనలు మంగళవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. దేశ విదేశాలలో ప్రఖ్యాత నాటక దర్శకులు రూపొందించిన ఆరు నాటకాలను రోజుకి ఒకొక్కటి చొప్పున ప్రదర్శితమయ్యే నాటకాలలో మొదటి రోజు ఎన్ ఎస్ డి రెపర్టరీ కంపెనీ, న్యూ ఢిల్లీ సమర్పణలో అజయ్ కుమార్ దర్శకత్వం వహించిన మై రి మెకా సె క హు నాటిక హిందీ భాషలో ప్రదర్శితమైంది. విజయ్ దాన్ దేతా దువిధ కథ ఆధారంగా రూపొందించిన ఏ నాటకం సమాజంలో స్త్రీ తన కోరికలు, భావోద్వేగాలు, సామాజిక నిబంధనల మధ్య పదే పదే పడే సంఘర్షణే ఇతివృత్తంగా, స్త్రీ భావాలు కోరికలు స్వేచ్ఛ వంటి అవకాశాలన్నీ ఇప్పటికే సమాజం సృష్టించిన రెండు చట్రాలకే పరిమితమయ్యాయని తెలుపుతూ ప్రదర్శితమైంది. దేశ విదేశాల నుంచి 100 నాటకాలు ఎంపిక చేసి దేశంలోని వివిధ నగరాల్లో ఒకటి నుంచి 20 ఒకటవ తేదీ వరకు ప్రదర్శింప చేస్తుంది. భవిష్యత్తరానికి నాటక రంగ వైభవాన్ని తెలిపేటందుకు, నాటకరంగ పునర్వైభవానికి నాటకోత్సవాలు దోహదపడతాయని విజయవాడ మధ్య నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ అన్నారు. మొదటిరోజు ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ ఇది ఒక బృహత్తరమైన కార్యక్రమమని ఒక్కొక్క ప్రాంత ఈ సంప్రదాయాలను తెలుసుకునేందుకు పలుచోట్ల నిర్వహించే ఈ ఉత్సవాలు ఎంతగానో ఉపయుక్తమవుతాయన్నారు. ఇటువంటి ప్రదర్శనల వలన నాటక రంగం సజీవంగా ఉందని ధ్రువీకరించుకోవచ్చున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగస్థలం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, ఆరున్నర దశాబ్దాలుగా అందరికీ చేరువయేలా నిర్వహిస్తున్న సంస్థలను శ్లాఘించారు. వేదికపై రాజేష్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వివేక్ తదితరులు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది సుమన్, చిముడూరి శ్రీనివాస్ తదితరులు నిర్వహించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : గ్రామ వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే.చంద్రశేఖర రావు జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, పంటల ఈ కేవైసీ, ధాన్యం సేకరణ, చెరువుల భర్తీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవలే కొత్తగా తహసిల్దార్లు, ఎంపీడీవోలు చేరారని వారి పరిధి ఏమిటో వారికి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం జిల్లాలో నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం కింద లబ్ధిదారుల ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో జరగవలసి ఉందన్నారు. అయితే కొన్ని చోట్ల డేటా వివరాలు లేనందున ఇంకా మొదలు కాలేదన్నారు. జిల్లాలో 85 వేల మంది లబ్ధిదారులకు గాను ఇప్పటివరకు 10,700 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. తహసిల్దార్లు ఎంపీడీవోలు మునిసిపల్ కమిషనర్లు వారి పరిధిలో ఉన్న గ్రామ వార్డు సచివాలయాలను సందర్శించి అక్కడ రిజిస్ట్రేషన్ పనులు ఎలా జరుగుతున్నాయి గమనించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకుని తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు పంటల ఈ కేవైసీ పురోగతి 60 శాతం వరకు పూర్తి చేశారని గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు ఈ-కేవైసి పై ప్రత్యేక దృష్టి సారించి మరింత పురోగతి సాధించాలన్నారు. ఇందులో నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పని హెచ్చరించారు. ధాన్యం సేకరణలో మరింత పురోగతి సాధించాలన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో చివరి వరకు నీరు అందాల్సి వుందన్నారు. నీరు వృధా కాకుండా అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుకోవాలన్నారు. డ్రైనేజీ కాలువల్లో తూడు తొలగించడం లేదని తన దృష్టికి వచ్చిందని ఇందుకోసం ఇప్పటివరకు ఎన్ని టెండర్లు పిలిచామని, అందులో ఎన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని, టెండర్లు పిలిచిన ఎక్కడ పనులు జరగడం లేదో వాటి వివరాలు వెంటనే అందజేయాలని కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని, దీనిపై సంబంధిత ఎంపీడీవోలు సంపూర్ణ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, డియెల్ డి ఓలు,తదితర అధికారులు పాల్గొన్నారు.

5 కోట్ల 62 లక్షల ఆసరా చెక్కులు : ఎమ్మెల్యే కొడాలి నాని

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ పట్టణ, రూరల్ మండలాల పరిధిలో నాలుగో విడత ఆసరా పథకం ద్వారా విడుదలైన 5కోట్ల,62లక్షల,16వేల,923 రూపాయల ఆసరా జంబో చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు (నాని) విడుదల చేశారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో 698 గ్రూపులలోని 6వేల,932 మంది సభ్యులకు విడుదలైన రూ.5కోట్ల,62లక్షల,16వేల,923 రూపాయల ఆసరా జంబో చెక్కును ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగు విడతలుగా 25వేల,5వందల కోట్ల రుణమాఫీతో పాటు, 3వేల,5వందల కోట్ల సున్నా వడ్డీ సొమ్మును జమ చేసిన ఘనత సిఎం జగన్ దేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుబ్రమణ్యం, పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఎంపిపి గద్దె పుష్పరాణి, వైస్ ఎంపిపి బట్టు నాగమల్లేశ్వరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, నాయకులు చింతల భాస్కరరావు, పాలేటి చంటి, ,అద్దేపల్లి పురుషోత్తం, ఎంవి నారాయణరెడ్డి, తోట మునిమ్మ, మాదాసు వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, తదితరులు, పాల్గొన్నారు.

ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తా : కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రతి పల్లెను అభివృద్ధి చేయదానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రణాళిక బద్ధంగా త్వరలో జరగనున్న ఎన్నికలకు సిద్ధమయ్యారని, ఆ విధానంలోనే పల్లెబాట కార్యక్రమం ప్రారంభించి రెండవ రోజు పామర్రు మండలంలోని ఉండ్ర పూడి, పోలవరం, జమీదగ్గుమిల్లి, రాపర్ల, ఉరుటూరు, గ్రామాలలో ఇంటింటికి వెళ్లి తనకు ఒక అవకాశం ఇవ్వాలని ప్రాధేయపడి ప్రజలను మంగళవారం వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పామర్రు మండల శాఖ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జన సేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుంప గంగాధర్, ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ని సత్కరించిన సర్పంచ్ జ్యోతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల నూతన తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న అమ్మాజీ ని మంగళవారం శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలియజేసిన అనిగండ్ల పాడు.సర్పంచ్ బి.జ్యోతి బ్రాహ్మం ఈ కార్యక్రమంలో అనిగండ్ల పాడు గ్రామ వై సిపి పార్టీ అధ్యక్షులు గంగూరి ప్రసాద్ వీఆర్వో గుర్రాల.ప్రకాష్ , సచివాలయ సిబ్బంది, వలెంటీర్లు మరియు తదితరులు పాల్గొన్నారు..

లోకో పైలెట్‌లను నిర్లక్ష్యం చేస్తే ప్రయాణికుల భద్రతకు ముప్పు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సురక్షింతంగా చేరుకొవటానికి ప్రధాన భూమిక పోషించే లోకో పైలెట్(లోకో రన్నింగ్ స్టాఫ్) అటువంటి వారి సమస్యలు పరిష్కరించటంలో యాజమాన్యం తీవ్రమైన నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పాటు పని వత్తిడి పెంచుతుందని దాని వలన ప్రయాణికుల భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని అల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కె.సి.జేమ్స్ తెలిపారు. మంగళవారం రైలేకవస్టేషన్ వద్ద ఉన్న రైల్వేఇన్‌స్టిట్యూట్‌లో రన్నింగ్ స్టాఫ్‌పై అమానుష పనిభారం- ప్రయాణికులు భద్రతకు ముప్పు అనే అంశంపై ఇంటర్ డివిజనల్ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైల్వేలో రన్నింగ్ స్టాఫ్ కాళీలు 16,373 ఉన్నాయని పార్లమెంట్ సాక్షిగా తెలిపారని అయితే ఇటీవల లోకో రన్నింగ్ పోస్టుల భర్తీకి కేవలం 5696 ఫోస్టలకు నోటిఫికేషన్ ఇచ్చారని ఇది చాలా దుర్మార్గమైన చర్యలు అన్నారు. అంతే కాకుండా ఎంతో మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నాయని ఇటువంటి సమయంలో కేంద్రం ఈ విధంగా మోసం చేయటం తగదని తక్షణం మిగిలి ఉన్న కాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న లోకో రన్నింగ్ సిబ్బందిపై పని భారం అధికంగా ఉంటుందన్నారు. ప్రధానంగా తగినంత సిబ్బంది లేకపోవటంతో అధిక గంటలు పని చేస్తున్నారన్నారు.అలాగే వారికి కావలసినంత విశ్రాంతి ,వారంతాపు శెలవులు లేకుండా కుటుంబానికి ఎక్కవ కాలం దూరంగా ఉండటం వలన అరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. దాంతో అసుపత్రికి వెళ్ళి సిక్ లీవ్ అడిగినా తిరస్కరణ చేస్తున్నారన్నారు.విధుల్లో ఉండగా టాయిలెట్లు లేమి. ప్రకృతి సహజమైన కాలకృత్యాలకు నిరామ సమయం,భోజన విరామ సమయం లేకపోవటం.మరొపక్క అడ్మినిస్ట్రేషన్ ద్వారా భద్రతా ఉల్లంఘునలు పేరుతో కఠినమైన/అనుచితమైన పనిష్మెంట్స్ ఇస్తున్నారని దాని ఫలితంగా మనోవేదనతో బాధపడుతున్నారన్నారు.వివిధ కమిటీల భద్రతా సిఫార్సులను అమలు చేయకపోవడం దారుణం అన్నారు. రైల్వేలు,దాని ఆస్తుల ప్రైవేటీకరణ,కొత్త పెన్షన్ పథకం (తక్కువ పెన్షన్/సామాజికీ భద్రత లేని పెన్షన్-సిబ్బందిని నిరుత్సాహ పర్చుతున్నాయన్నారు. తక్షణం ఎన్‌పిఎస్ ఉపసంహరించుకోవాలి.పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి,సేఫ్టీ కేటగిరీలలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు.ఈ సెమినార్‌లో విజయవాడ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి ఎమ్.వెంకటేషన్,కె.రామకృష్ణ,వి.బాల చంద్రన్, సి. హెచ్.శ్రీనివాస్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, డివిజన్‌ల నుండి లోకో పైలెట్‌లు పాల్గొన్నారు.